క్లుప్తంగా

నేడు కూరగాయల మార్కెట్ ప్రారంభం

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులోని కూరగాయల మార్కెట్‌ను ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. రూ.25లక్షలతో పనులు చేపట్టామన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయానికి విగ్రహాల వితరణ



సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వంకదారి విజయ్ దంపతులు కల్పనా సెంటర్ రామాలయానికి సీతారాముల వెండి విగ్రహాలను మంగళవారం అందజేశారు. వారి ఇంటి వద్ద నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకుడు సురేష్ శర్మకు అందజేశారు. విజయ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు వంకదారి దేవనాదం, భాగ్యలక్ష్మిల జ్ఞాపకార్థంగా రూ.లక్ష విలువ చేసే సీతారాముల విగ్రహం, వెండి పళ్లెం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మాజీ కౌన్సిలర్ శంకర్, సురేష్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుండుపాపల గ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు విద్యాసాగర్, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి 560 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్య, గ్రామ సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా కులగణన

దొర్నిపాడు: మండలంలో కులగణన సర్వే ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో కులగణన సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయా సచివాలయల్లోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గడువులోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. ఎమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఎంఈఓ రామచంద్రయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు లక్ష్మయ్య, వెంకటనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

బొమ్మలసత్రం: నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు సబ్ ఇన్ స్పెక్టర్ నాగార్జున జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ముచ్చుమర్రి సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా బ్రాహ్మణకొట్కూరు పోలీస్టేషన్‌కు బదిలీ అయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీని కలిశారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

నందాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ నారాయణపురం గ్రామానికి చెందిన కొంతమంది మద్యం సేవించి ఆసుపత్రిలోకి రాగా.. వాహనాలను పార్కింగ్‌లో ఉంచాలని చెప్పిన క్రిష్టఫర్, పెద్దన్న, మహిళా సెక్యూరిటీ గార్డులపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు చెన్నయ్య, లక్ష్మి, కోటి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- ప్రభుత్వం క్లిష్టపరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు ఆపలేదు
- టీడీపీ ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా గమనించండి
- వైఎస్సార్ ఆసరా నాల్గో విడత నిధుల విడుదల
- జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



ఆసరా మెగా చెక్కును విడుదల చేస్తున్న జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సంక్షేమ పథకాలను ఆపకుండా లబ్ధిదారులకు ఇచ్చిన మాటప్రకారం పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్నీ వర్గాలను మోసం చేసిన మోసగాడు చంద్రబాబు నాయుడన్నారు. గత ఎన్నికల సమయంలో 660 హామీలు ఇచ్చి అందరికీ బాండ్లు అందజేసి మోసం చేసిన ఘన చరిత్ర చంద్రబాబుదే అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆరు గ్యారెంటీలు అని తిరుగుతూ మరోసారి మోసం చేసేందుకు అన్నివిధాల ప్రయత్నాలు కొనసాగిస్తున్నారన్నారు.

ఐదేళ్లలో ఒక్క చిన్న ఘటన కూడా జరగలేదు

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు అవుతున్నా ఏ ఒక్క చిన్న సంఘటన కూడా జరగలేదని గుర్తు చేశారు. టీడీపీ మరోసారి అధికారంలోకి వస్తే ఎవరి ఆస్తులు ఎవరికి రిజిస్టరు అవుతాయో కూడా తెలియదని, ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా మీరే గమనించాలని, అజాగ్రత్తతో ప్రభుత్వం మారెలా నిర్ణయం తీసుకుంటే ఇప్పుడు పేదవారికి అందుతున్న సంక్షేమ పథకాలన్నీ అటకెక్కుతాయన్నారు. చంద్రబాబు చెబుతున్న ఆరు గ్యారెంటీల కంటే ఇప్పుడున్న జగనన్న ప్రభుత్వం 29 రకాల సంక్షేమ పథకాలు అందజేస్తోందని తెలిపారు. మీ కుటుంబానికి ఈ ప్రభుత్వంలో మంచి జరిగిందని భావిస్తేనే మరో సారీ నన్ను ఆశీర్వదించమని అడిగే దమ్మున్న నాయకుడు దేశంలో ఎవరూ లేరన్నారు. జరగబోయే ఎన్నికల్లో ఆత్మసాక్షిగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు.



సమావేశానికి హాజరయిన పొదుపు మహిళలు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు మంజూరు అయిన రూ.19.96 కోట్లు, రూరల్‌లో మంజూరు అయిన రూ.11.77కోట్లు విలువ చేసే మెగా చెక్కును విడుదల చేసి లబ్ధిదారులకు అందజేశారు. చెక్కు అందుకున్న మహిళా సంఘాల సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయ డైయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కమిషనర్ రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులపై శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు యునెస్కో సౌజన్యంతో సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులపై శిక్షణ కార్యక్రమం జరిగింది. రీసోర్స్ పర్సన్ లలిత, కళాశాల ప్రిన్సిపల్ శశికళ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులకు శిక్షణపై తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి రోజు 35మంది హాజరై తర్ఫీదు పొందుతున్నారని వివరించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

రుద్రవరం: మండలంలోని అంగన్‌వాడీ ఉద్యోగులు అందరూ మంగళవారం విధుల్లో చేరినట్లు సూపర్ వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. మొత్తం 63 కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాల ఉద్యోగులంతా ఇన్‌చార్జ్‌ల నుంచి వస్తు సామగ్రి, రికార్డులు స్వీకరించి తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు వెల్లడించారు. డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులందరూ కేంద్రాలను మూసి 42 రోజుల పాటు నిరసనలు చేపట్టారు. సోమవారం ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో వారు సంతోషంగా కేంద్రాలను తెరిచారు.

సారా విక్రేత అరెస్ట్

మహానంది: గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మ తోపు గ్రామంలో నాటుసారా విక్రయ దారులపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు లక్ష్మీదేవిని అదుపులోకి తీసుకుని 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో సారావిక్రేత శివకుమార్ పరారైనట్లు చెప్పారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, కౌన్సిలర్ నాగినిరెడ్డి

నంద్యాల టౌన్: మహిళలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో గర్భాశయ కాన్సర్‌పై నంద్యాల పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులు కూడా వైద్యులతో కలిసి గ్రామలలో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మునిసిపల్ కౌన్సిలర్ నాగిని రెడ్డి మాట్లాడుతూ గర్భాశయ కాన్సర్ పై అవగాహన కల్పించడం వల్ల మరింత మంది కాన్సర్ బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఫోరం చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ మహిళా విభాగాల ఆధ్వర్యంలో గర్భాశయ కాన్సర్ పై అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన మాట్లాడుతూ మహిళలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ప్యాప్‌స్మియర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 25 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకోవటం వల్ల ఈ కాన్సర్ ను నివారించ వచ్చన్నారు. అనంతరం పద్మావతి నగర్ ఆర్చ్ వరకు ర్యాలీ నిర్వహించారు. శాంతిరం ఫార్మసీ కళాశాల విద్యార్థినులు, ప్రైవేట్ ఆసుపత్రుల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

సాక్షి, నంద్యాల: నంద్యాల నియోజకవర్గంలో గత 221రోజులుగా నిర్విరామంగా సాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ముగిసింది. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ 18వ వార్డు కౌన్సిలర్, మాజీ చైర్‌పర్సన్ దేశం సులోచన, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దేశం సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా రవి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 221రోజుల పాటు నంద్యాల నియోజకవర్గ ప్రజలతో మమేకమై వారితో నిత్యం ఉడడం ఒక గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. నంద్యాల ప్రజలకు మరింత సేవ చేయడానికి ఎప్పటికీ సిద్ధంగా ఉంటానన్నారు. అనంతరం ముగింపు వేడుకలను పురస్కరించుకుని కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, నంద్యాల పట్టణ అధ్యక్షులు పున్నాశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

14న వసంతపంచమి వేడుకలు

కొత్తపల్లి: మండలంలోని అధికారుల సమన్వయంతో కొలనుభారతిదేవి ఆలయంలో నిర్వహించే వసంతపంచమి వేడుకలను విజయవంతం చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ సూచించారు. మంగళవారం కొలనుభారతి క్షేత్రంలో ఈఓ మోహన్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చేనెల 14న కొలనుభారతి క్షేత్రంలో వసంతపంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు, సందర్శకులు వేల సంఖ్యలో వస్తారన్నారు. వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సేవలందించాలని సూచించారు. అదేవిధంగా భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రిపోర్టులు సకాలంలో పంపాలి

నంద్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహించే రోజువారీ పరీక్షల రిపోర్టులను సకాలంలో జిల్లా అధికారులకు పంపాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. మంగళవారం స్థానిక సమావేశ మందిరంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా మేనేజర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంతో హైపటైటిస్ బీ,సీ, హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి వారికి కేటాయించిన లక్ష్యాలు పూర్తిచేయడమే కాకుండా, పరీక్షల రిపోర్టులు త్వరితగతిన అందించి సంభంధింత వివరాలను జిల్లా స్థాయి అధికారులకు అందేలా చూడాలన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి శారదాబాయ్ మాట్లాడుతూ ఏపీ సాక్స్ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. టీబీ పరీక్షలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఏఓ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, అకౌంటెంట్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించాలి



ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

ఆళ్లగడ్డ: రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు చేసి వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. మంగళవారం బత్తలూరు, కోటకందుకూరు గ్రామాల్లోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అధికారులు రైతులకు అందుబాటు ఉండాలని సూచించారు. సాగు చేసిన పంటను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ రామమోహన్‌రెడ్డి, ఏఓ కిశోర్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చాగలమర్రి: జిల్లాలో రైతులందరూ సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, శెట్టివీడు, పెద్దబోధనం, రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు ఈ నెలాఖరు లోపు పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఏఓ రంగ నేతాజీ, సచివాలయ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఉన్నారు.

నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి



నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రావూస్ కళాశాలలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుంకయ్య మాట్లాడుతూ యువతీ యువకులు సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకై, సమ సమాజం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు, విద్యార్థి సంఘం నాయకులు ఓబులేసు, రియాజ్, సుంకన్న, ఖాజా, శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జ్ నన్నల సాయి రాంరెడ్డి అన్నారు. స్థానిక న్యూక్లియస్ కళాశాలలో మంగళవారం నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, అనిల్, కళాశాల ప్రిన్సిపల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిజేబుల్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు 30 మందికి దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో డిజేబుల్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్ వలి, రోటరీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, ఎల్లయ్య,కిరణ్‌కుమార్ దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : స్థానిక ప్రజ్ఞా స్కూల్‌లో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు



దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కోటయ్య ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, సహదేవరెడ్డి, పీడీ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలసిన సెబ్ ఇన్ స్పెక్టర్ విశ్వనాథ్ రెడ్డి



అడిషనల్ ఎస్పీ వెంకటరాముడుకు మొక్కను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

బొమ్మలసత్రం: నంద్యాల సెబ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.విశ్వనాథ్‌రెడ్డి జిల్లా అడిషినల్ ఎస్పీ వెంకటరాముడును మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ కడప జిల్లాలో సెబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల సెబ్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల సెబ్ ఇన్‌స్పెక్టర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా అడిషినల్ ఎస్పీని కలిశారు.

రేపు ఆలయ రూముల అద్దెకు వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర స్వామి దేవస్థానానికి చెందిన రూముల అద్దెకు బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ. లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తారీఖు ఉదయం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, రూములను మూడు సంవత్సరాల కాలపరిమితికి (01-02-2024 నుంచి 31-01-2027 వరకు) అద్దెకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీలకు 2022-23 ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీకి రూ. 21.63 లక్షలు, యర్రగుంట్ల రూ. 8.28 లక్షలు, గోవిందపల్లెకు రూ. 8.29 లక్షలు మంజూరయ్యాయి. గుంప్రమాన్‌దిన్నెకు రూ.3.87 లక్షలు, జీనేపల్లెకు రూ.1.61 లక్షలు, వనికినిదిన్నెకు రూ.1.30లక్షలు, కోటపాడుకు రూ.2.83 లక్షలు, చెన్నూరుకు రూ.3.50 లక్షలు, గంగవరం రూ.2.27 లక్షలు, గుండంపాడుకు రూ.2.17 లక్షలు కేటాయించారని చెప్పారు. మహదేవపురం రూ. 3.29 లక్షలు, బోయలకుంట్ల రూ. 3.77 లక్షలు, వెంకటాపురం రూ. 1.64 లక్షలు, వీరారెడ్డిపల్లెకు రూ. 1.36 లక్షలు, మోత్కులపల్లె పంచాయతీకి రూ.1.39 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్): ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారి శ్రీకాంత్, డీఎస్పీ మహేశ్వరరెడ్డి నేషనల్ హైవే అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లాలోని నేషనల్ హైవే-40రోడ్డుపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హైవేపై అయ్యలూరు మెట్ట నుంచి సుగాలి మెట్ట వరకు, చాబోలు క్రాస్ రోడ్డు వరకు వెంకటేశ్వరపురం, శాంతిరామ్ మెడికల్ కాలేజ్, పిన్నాపురం రహదారులను అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్, నేషనల్ హైవే అధికారులు సుధాకర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'



తుడుమలదిన్నెలో వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



నేలంపాడు వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు సురేష్

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి రక్షణగా ఉంటుందని ఎంపీడీవో అనసూయ, ఎంఈఓ అబ్దుల్ కరీం అన్నారు. మండలంలోని కానాల పల్లె గ్రామంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు గోవర్ధన్ రెడ్డి ,క్రాంతి చైతన్య, జ్యోతి వాణిరెడ్డి 447 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో మొత్తం 504 మందికి వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి కిశోర్, రమేష్‌లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

403 మందికి వైద్య సేవలు

చాగలమర్రి: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో నేలంపాడు గ్రామ సచివాలయంలో ఫేస్-2 జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో సుమారు 403 మంది వైద్య సేవలు పొందినట్లు వైద్యులు తెలిపారు.

శిరివెళ్ల: స్థానిక 3వ గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు క్రాంతి కిరణ్, శ్రీకాంత్, కృష్ణమోహన్‌రెడ్డి 505 మందికి కంటి, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేశారు. 8 మందిని ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీ భవ్యశ్రీ, ముఖేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



శ్రీకాళికాంబ అమ్మవారు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్, తిమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.